# నిశీథి నాదం

...మామిళ్ళ కోటేశ్వరరావు

eBook @ www.kinige.com

# నిశీధి నాదం

- మామిళ్ల కోటేశ్వరరావు

---

తొలి ఈబుక్ : 2013

© మామిళ్ల కోటేశ్వరరావు

To purchase eBook visit www.kinige.com





29-178 / H5A, State Bank Colony
NANDYAL – 518 501,
Kurnool Dist. A P



www.koteshmamilla.in



krmamilla@yahoo.co.in
koteshmamilla@gmail.com

## పూర్వరంగం:

నేటికి సుమారుగా ఎనభై సంవత్సరాల క్రిందట..........

ఒక  అమావాశ్య రాత్రి...............

"వనసీమ" అడవి మధ్యలో–



ఇద్దరు వ్యక్తులు తంత్ర సాధన గావిస్తున్నారు.

ఇద్దరూ 'బిక్కి బిక్కి' వంశస్తులే ..... తండ్రీ కొడుకులు.

మాంత్రిక ప్రపంచంలో బిక్కి బిక్కి మాటకు ఎదుర్లేదు.

అతడు చెప్పింది వేదం. చేసింది శాసనం.

బిక్కి బిక్కి వంశం మహా మంత్రగాళ్ళకు ఆలవాలం. ఆ వంశంలో ప్రతి ఒక్కరికీ 'బిక్కి బిక్కి' పేరే వుంటుంది.

నిశీథినాద విద్యను తరువాతి తరానికి నేర్పే ప్రక్రియలో ఆ వంశంలోని ప్రతిఒక్కరూ మరణిస్తున్నారు. మరణం అనివార్యమని తెలిసినా, ఏ ఒక్కరూ భయపడటం లేదు. ప్రాణాలను లెక్కచేయకుండా వంశప్రతిష్ట కోసం తరతరాలుగా వాళ్లు చేస్తూన్న సాహసమే ఆ వంశానికి అంత పేరును

సమకూర్చింది.

బిక్కి బిక్కి ఆ రోజు రాత్రి తన కొడుకు బిక్కి బిక్కికి చివరి తంత్ర సాధన నేర్పిస్తున్నాడు.... తమ వంశంలో ఇంతవరకూ ఎవ్వరూ చేయని ప్రయోగాన్ని చేసేందుకు సాహసిస్తున్నాడతడు. తద్వారా మాంత్రిక ప్రపంచాన్ని శాశ్వతంగా తమ వంశం గుప్పిట్లో వుంచవచ్చని అతడి ఆలోచన.

నియమాను సారం .... అరుదుగా కనిపించే ఒక చెట్టును కాండం వరకూ నరికి తెచ్చి అక్కడ ప్రతిష్ఠించారు...

అర్చనలయిన తర్వాత నూటొక్క జింకల రక్తంతో ఆ చెట్టును అభిషేకించారు. ఏకాగ్రతతో బిగ్గరగా మంత్రోచ్చారణ కావిస్తూ క్షుద్రశక్తిని ఆ చెట్టు లోకి ఆహ్వానించారు.

భూత, భవిష్యత్, వర్తమానాల గురించి తామడిగే అన్ని ప్రశ్నలకు ఆ క్షుద్రశక్తి సమాదానమిస్తుంది. మొదటి ఝాము ప్రవేశించకముందే ఆ క్షుద్రశక్తిని చెట్టు నుండి ఉపసంహరించాలి.

మంత్రాలతో ఆహ్వానితమైన క్షుద్రశక్తి ఆ చెట్టు లోకి ప్రవేశించింది. భూత భవిష్యత్ వర్త మానాల గురించి అన్ని ప్రశ్నలూ సంధించారు, సమాధానాలు రాబట్టారు.

మొదటి ఝాము ఆరంభం కాబోతూంది. ఉపసంహరణ అనుకున్నట్టుగా జరగలేదు. ప్రకృతి సహకరించక పోవటం వల్ల కొన్ని సెకన్ల కాలాతీతమయింది. రెండు విఘడియలు ఆలస్యమయ్యేట్టుంది.

...... మరు క్షణంలో 'ఫట్' మన్న శబ్దంతో బిక్కి బిక్కి తల పగిలింది.

అతడి కొడుకు బిక్కి బిక్కి దిగ్భ్రాంతుడయ్యాడు.

నిశిరాత్రి. గాఢంగా అలుముకున్న చీకటి. సగం వెలుగు నిస్తున్న చమురు దివ్వె కొడిగట్ట బోతూంది.

ఆ చెట్టు కొమ్మలు, పెను తుఫానులా భీకర శబ్దం చేస్తూ, కరాళ నృత్యం చేస్తున్నాయి. ఆ దృశ్యం, వందల కొలదీ త్రాచుపాములు ఒకే సారి తోకమీద నిల్చుని నాట్యమాడినట్టుంది. ఎంత మొండి ధైర్యవంతుడికైనా ముచ్చెమటలు పట్టటం ఖాయం.

జీవితంలో, మొట్టమొదటి సారి, భయమంటే ఏమిటో తెలిసింది బిక్కి బిక్కికి. అతడికి ఉప సంహారం సగమే తెలుసు. కానీ క్షుద్రశక్తిని ఆకర్షించి, కాసేపు స్తంభింపజేసి, ఆరు గజాల దూరంలో నిలిపే 'నిశీథి నాదం' వారసత్వంగా అతడికి ఇటీవలే సంక్రమించింది. అయితే దానివల్ల ఉపయోగం లేదు.

తృప్తి పడని ఆ క్షుద్రశక్తి మరో గడియ తర్వాత, ప్రళయకాల ఝంఝూమారుతంలా, కొమ్మలతో వీరవిహారం చేస్తూ, చెట్టుతో సహా విస విసా నడుచుకుంటూ అడవిలో కెళ్ళి పోయింది.

మ్రాన్పడి పోయాడు బిక్కి బిక్కి.

## ప్రస్తావన:

ఇప్పటికి ఇరవై ఏళ్ళ క్రిందట.

ఒక రోజు ఉదయం తొమ్మిది గంటల సమయంలో వనసీమ అటవీ ప్రాంతంలోకి దుమ్ము రేపుకుంటూ ప్రవేశించింది ఒక జీపు. రోడ్డున్నంత వరకూ వెళ్లి ఆగిపోయింది.

జీపు నుండి దిగింది ఒక యువ జంట.

సుమారు ముప్పయ్యేళ్లున్న ఒక యువకుడు. అతడి భార్య, ఆరేళ్ల వయసున్న అతడి కూతురు.

ఆమె ఒళ్లంతా కళ్లు చేసుకుని ప్రకృతి అందాల్ని పరిశీలిస్తూంది. ఆమె వెంటే ఆ చిన్ని పాప తప్పటడుగుల్తో అనుసరిస్తూంది.

అతడు పరిసరాల్ని వివరించి చెప్తున్నాడామెకు.

మధ్యాహ్నం ఒంటి గంటవుతుండగా కాన్వాస్ పరిచి 'వన భోజనం' ముగించారు. నాలుగు వరకూ విశ్రమించి, మళ్లీ ప్రకృతి పరిశీలనలో మునిగి పోయారు ఆరు వరకూ.

ఆ తర్వాత వస్తువులన్నీ సర్ది జీపులో వుంచారు. అతడు డ్రయివింగ్ సీట్లో కూర్చొని 'ఇగ్నిషన్' ఆన్ చేశాడు. జీపు కదల్లేదు. మళ్లీ ప్రయత్నించాడు. కదల్లేదు. మళ్లీ... మళ్లీ...

అనుమానంగానే క్రిందికి దిగి, కారణమేదో పరిశీలించాడు. టాంకు లో పెట్రోలు లేదు. జాగ్రత్తగా పరిశీలిస్తే, టాంకు క్రింద చిన్న చిల్లు వుందన్న విషయం

అర్థమైంది.

"మై గాడ్" అంటూ తల పట్టుక్కూచున్నాడతడు.

సందె చీకట్లు ముసురుకున్నాయి అప్పటికే.

చలి విపరీతంగా వుంది. భయంతో, చలితో మునగదీసుక్కూచుందామె.

అడవి గురించి ఎక్కడెక్కడో చదివిందంతా గుర్తొస్తూంది.

ఆమె ఏడవడం ప్రారంబించింది. పాప కూడా.

సముదాయించలేక పోతున్నాడతడు.

క్రూర మృగాలొచ్చే వేళ ...........

'ఎండు పుల్లల్తో మంట వేస్తే ఏ జంతువులూ దగ్గరకు రావు' అని ఆమెకు చెప్పి, ఎండు పుల్లల్ని ఏరేందుకు పక్కకు కదిలాడు.

అతడు బయల్దేరిన మూడు నిమిషాలకు .............

దిక్కులు పిక్కటిల్లేలా ఆమె ఆర్తనాదం వినిపించింది. వెంటనే పాప ఆర్తనాదం.

అతడి గుండెలదిరాయి.

వెనుతిరిగి పరుగెత్తాడు.

ఒక చెట్టును ఆసరాగా చేసుకుని నిలబడుతూ, టార్చి వెలుగులో కారు వైపు చూశాడు.

అంత భయంకర దృశ్యాన్ని అతడేనాడు చూడలేదు తన జీవితంలో...........

# 1

## ప్రారంభం:

సూర్యాస్తమయం దగ్గర పడుతున్న కొద్దీ, ఇంద్రాణి హృదయ స్పందన ఆరాటాన్నందు కొంటూంది.

ఇంకా అయిదున్నర కాలేదేమిటీ అన్నట్టు గోడ గడియారం కేసి తీక్షణ దృక్కులు సారిస్తోంది అప్పుడప్పుడూ. అది కూడా చిలిపిదే వున్నట్టుంది, మరికాస్త నెమ్మదిగా నడవగలను సుమా అన్నట్టు మరింత నింపాదిగా కదుల్తూంది.

లైట్ బ్లూ షిఫాన్ చీరలో లవ్లీ గా మెరుస్తూన్న ఇంద్రాణి లైలాను మరిపించేట్టుంది.

ఇంద్రాణి ......... న్యూఢిల్లీ జె.ఎన్. యూనివర్సిటీలో ఫైనలియర్ ఎమ్మెస్సీ స్టూడెంట్.

వినయం, విధేయత, మితిమీరని కొంటెతనం ...సమపాళ్లలో మేళవించాయి అనుకొంటారు కొందరు ప్రొఫెసర్లు ఆమెను చూసి.

'మీ అందాన్ని నిర్ణయించడానికి మిస్ ఇండియా పోటీలైతే సరిపోగలవేమో గానీ, మీ తెలివిని కొలవడానికి ఇండియాలో మరే విదమైన పరికరాలు లేవని' అభివర్ణిస్తుంటారు ఆమెకు ప్రేమలేఖలు రాసే కొందరు ప్రేమికులు.

ఇంద్రాణి మరో మారు టైమ్ చూసింది. అయిదూ పది దాటింది. ఆమె వదనంలో ఉత్సుకత ద్యోతకమవుతూంది.

అందుక్కారణం.

ఇంద్రాణి ఆ రోజు ఎమ్మెస్సీ చివరి పరీక్ష రాసింది.

బాటనీ ఆమె స్పెషలైజ్ డ్ సబ్జెక్ట్.

కొన్ని కారణాల వల్ల ఆ యూనివర్సిటీ  పి.జి. పరీక్షలు ఆలస్యమయ్యాయి. అప్పటికే మిగిలిన కాలేజీలు ప్రారంభమయ్యాయి.

అందరికన్నా చివరిగా పరీక్షలు జరగటం వల్ల హాస్టల్లో కేవలం పి.జి. స్టూడెంట్సే మిగిలారు. చివరి పరీక్ష రాసి, ఆ రాత్రి ఎనిమిది గంటల ట్రయిన్ లో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు టికెట్స్ కూడా రిజర్వ్ చేయించారు చాలా రోజుల కిందటే.

చాలా మంది హృదయాలు  బాధతో మూలుగు తున్నాయి, ఇక విడిపోతున్నాము సుమా అన్న భావన రాగానే.

అదేం చిత్రమో చివరి పరీక్ష ఎప్పుడయిపోతూందా అని ఆత్రంగా ఎదురుచూసిన వాళ్లు, ఇప్పుడేమో ఎందుకంత త్వరగా అయిపోయిందా అని విచార వదనారవింద లవుతున్నారు.

మళ్లీ ఎక్కడ కలుస్తామో, ఎప్పుడు కలుస్తామో, అసలు కలుస్తామో, కలువమో అనే ఆలోచన మనసులను మెలి పెడుతూంటే, భూమి గుండ్రంగా వుంది కదా, ఎక్కడో ఒక చోట ఎదురు పడక పోతామా అన్న భావన కాస్త

ఉపశమనాన్నిస్తూ బరువెక్కిన మనసులను తేలిక పరుస్తూంది.

అయిదున్నరకు మెస్ లో  చిన్న సెండాఫ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఫ్రెండ్సందరూ బిలబిలమని వచ్చారు ఇంద్రాణి గదిలోకి. అందరూ వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఇంద్రాణి కూడా వారితో పాటు వెళ్లేదే............

సరిగ్గా ఆ సమయంలో వచ్చింది శారదమ్మ. ఆమె ఆ యూనివర్సిటీ బాటనీ విభాగంలో స్వీపర్.

అటువంటి ఎందరో విద్యార్థినులను ప్రతి సంవత్సరమూ చూస్తూంటుంది ఆమె. ప్రతి ఒక్కరూ ప్రత్యేకం. ఒక్కొక్కరిదీ ఒక్కోరకమైన అందం. చిత్రం—— అందరూ మంచివాళ్లే... దేశం నలుమూలల్నుండీ వచ్చి ఒకే చోట హాస్టల్లో కలిసి మెలిసి వుంటున్న వారు కాబట్టి అది సహజం.

అందరికీ శారదమ్మ అంటే ఒక రకమైన అభిమానం. అభిమానం కూడా కాదు, పెద్దరికపు గౌరవం.

అందరూ ఆప్యాయంగా పలకరించారామెను. ఎందుకోగాని, ఆ పలకరింపులో ఒకింత వీడ్కోలు లాటి భావన మిళితమై వుంది.

వారు గమనించని సమయాన శారదమ్మకు కాస్త ఒంటరి తనం చిక్కింది ఇంద్రాణీతో మాట్లాడేందుకు. 'ఇందమ్మగారూ .. ప్రొఫెసర్ సార్ మిమ్మల్ని అర్జంటుగా కలవాలన్నారు. చాలా ముఖ్యమైన విషయమంట. మిమ్మల్నొక్కరినే సాయంత్రం అయిదింటికి బోటనీ లాబ్ కు రమ్మన్నారు. చాలా రహస్యమని చెప్పారు' – గుసగుసగా చెప్పి శారదమ్మ వెళ్లిపోయింది.

ఇంద్రాణి మిగిలింది ఆశ్చర్యచకితగా.....

ప్రొఫెసరుగారు తనతో మాట్లాడబోయే ఆ రహస్య విషయం ఏమై వుంటుంది. అంత రహస్యంగా వుంచాల్సిన అవసరం ఏముంది. ఇంతకాలం చెప్పకుండా, తీరా తాము శాశ్వతంగా యూనివర్సిటీ వదిలి వెళ్లబోవటానికి రెండు గంటల ముందుగా చెప్పాలనుకోవటంలో ఆయన ఆంతర్యం ఏమైవుంటుంది.

పరిపరి విధాల పోతున్నాయి ఇంద్రాణి ఆలోచనలు. తాను ఇప్పుడేం చెయ్యాలి. ఎక్కడి కెళ్లాలి? సెండాఫ్ పార్టీకా? బోటనీ లాబ్ కా?

వెంటనే నిర్ణయం తీసుకోలేకపోయింది. ఆలోచించీ, ...చించీ చివరకు ప్రొఫెసర్ను కలవడమే మంచిదనే అభిప్రాయంతో, ' కాస్త తలనెప్పిగా వుంది. మీరెళ్లండి. టాబ్లెట్ వేసుకుని, నేను కాసేపాగి జాయినవుతా......' అని స్నేహితురాళ్లను పంపేసింది. క్షణం సేపు నిరాశపడి, 'ఓకె... ఓకె... త్వరగా రావాలి సుమా. వెయిట్ చేస్తూంటాము' అంటూ వెళ్లారు.

వాళ్లతో అలా అబద్ధం చెప్పినందుకు ఆమె హృదయం భారమైంది. అప్పటి నుంచీ ఆలోచిస్తూంది ఇంద్రాణి. హాస్టల్లో ఒంటరిగా మిగిలింది. గాఢమైన ఆ నిశ్శబ్దం ఆమెను మరింత ఒంటరి చెయ్యాలని ప్రయత్నిస్తోంది.

హాస్టల్ కి బోటనీ లాబ్ దగ్గరే. మధ్యలో రెండు గార్డెన్స్ మాత్రమే అడ్డు. మూడు నిమిషాల నడకతో చేరుకోవచ్చు.

ఆతృత ఇంద్రాణి అణువణువునా వ్యాపిస్తూంది.

క్షణాన్నొక యుగంగా బావిస్తూ నెమ్మదిగా కదులుతూ వస్తూన్న సెకన్ల ముల్లు ఎట్టకేలకు తన సారధ్యంలో మిగిలిన రెండు ముల్లుల్నూ అయిదంకెకు కాస్త

అటూ ఇటూగా చేర్చబోతూంది.

తలుపుకు గడియ వేసి, కాంపస్ వైపు నడక సాగించి, మూడు నిమిషాల వ్యవధిలో బోటనీ లాబ్ చేరుకుంది.

విశాలమైన కారిడార్. చుట్టూ నంది వర్దనం పూలమొక్కలు, మధ్య మధ్య క్రోటన్స్ కూడా.

బయట వసారాలో నిల్చున్న శారదమ్మ ఇంద్రాణిని చూసి గౌరవ సూచకంగా కాస్తంత కదిలింది.

“ప్రొఫెసర్ సారు మీ కోసమే ఎదురు చూస్తున్నారమ్మా! క్షేమంగా వెళ్లి లాభంగా రండి”

తలుపు తెరచుకొని లోపలకు అడుగు పెట్టబోతూన్న ఇంద్రాణికి శారదమ్మ మాటలు అస్పష్టంగా విన్పిస్తున్నాయి.

శారదమ్మ చివరి వాక్యం విన్న ఇంద్రాణి, ఎందుకో తెలియదు కానీ, క్షణంలో వెయ్యోవంతు సేపు శారదమ్మను గమనించింది. ‘హాబిట్యుయేటెడ్ మెకానికల్ టైప్’ గా అన్పించింది. కానీ పెద్దగా పట్టించుకోలేదు ఆ విషయాన్ని.

ఆ లేబరేటరీ గది చాలా పెద్దది. నిజానికి ఆ యూనివర్సిటీలో అతి పెద్ద లాబ్ బోటనీ వాళ్లదే.

లాబ్ లో బల్లనానుకుని నిల్చున్న బోటనీ ప్రొఫెసర్ ప్రభాకరరావు ఆమెని గమనించాడు. చిరునవ్వుతో స్వాగతమిచ్చాడు.

“ఇంద్రాణీ... ఇటు రామ్మా! ఇక్కడ కూర్చో” అంటూ తన ఎదురుగా

వున్న కుర్చీ చూపించాడు.

ఇంద్రాణి మరింతగా ఆశ్చర్యపడింది. ప్రొఫెసర్ గారు ఆంధ్రాకు చెందిన వారని తెలుసుగానీ, అతడు తెలుగులో మాట్లాడు తుండగా చూడ్డం ఈ రెండేళ్లలోనూ ఇదే ప్రథమం. అంతే కాదు, మితభాషి అయిన ఆయన ఇంతవరకూ “యూ, యువర్ సెల్ఫ్, దట్ లాస్ట్ గర్ల్” ఇలా సంబోదించగా విన్నదే గానీ, ఇంత చనువుగా, ఏక వచనంలో, పేరు పెట్టి పిలవగా వినడం ఇదే మొదటిసారి ఆమెకు.

మౌనంగా కూర్చున్న దామె.



ఆమె వైపొక సారి చూసి, గొంతు సవరించుకున్నాడు ప్రభాకర రావు.

మొత్తానికి అతడేదో ఒక ముఖ్యమైన విషయం తనతో చెప్పబోతున్నాడని అర్థమయింది ఆమెకు. అతడి మనసులో వున్నదేదో ఊహించడానికి విఫల ప్రయత్నం చేస్తూందామె.

ప్రశాంతమైన పరిసరాలు. గాఢమైన నిశ్శబ్దం. అంతకు మించిన స్థబ్దత లాటిదేదో అక్కడ ఆవరించుకుందా క్షణం.

“నీ వయస్సెంతుండొచ్చు ఇంద్రాణీ?” ప్రొఫెసర్ గారి పెదవులు విచ్చుకుని అచ్చతెలుగు మాటల్లో వెలువడిన మెదటి ప్రశ్న అది.

ఇంద్రాణిలో కాస్తంత బెరకు చోటు చేసుకుంది. అయినా యూనివర్శిటీ సర్కిల్లో అతనికున్న మంచిపేరు ఆమెకు తెలియనిది కాదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/kbook.php?id=2444

* * *